క్లుప్తంగా

16న రాస్తారోకో



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని శివాజీచౌక్‌లో ఈనెల 16న ప్రైవేట్ వాహనాల డ్రైవర్ల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ప్రైవేట్ వాహనాలకు గిరాకి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. శివాజీ చౌక్ నుంచి సిరిచెల్మ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి శివాజీ చౌక్‌లో రాస్తారోకో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎస్సై నరేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

17న సంత్ శ్రీ తుక్డోజీ మహరాజ్ పుణ్యతిథి

ఎదులాపురం: సంత్ శ్రీ తుక్డోజీ మహరాజ్ 55వ పుణ్యతిథి మహోత్సవాన్ని ఈనెల 17న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. పల్లకి సేవతో పాటు పట్టణంలోని రాంనగర్ వద్ద గల శ్రీ రామ మందిరంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

వేంకటేశ్వర స్వామి పల్లకి ఊరేగింపు



పల్లకి ఊరేగింపులో ఎంపీపీ గండ్రత్ రమేశ్

ఆదిలాబాద్‌రూరల్: వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని యాపల్‌గూడలో వేంకటేశ్వర స్వామి పల్లకిని ఊరేగించారు. ఈ వేడుకల్లో ఆదిలాబాద్ రూరల్ ఎంపీపీ గండ్రత్ రమేశ్ పాల్గొన్నారు. మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ప్రతీ ఏడాది వేంకటేశ్వర స్వామి పల్లకిని గ్రామంలో ఊరేగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు నరేశ్, కొడప నారాయణ, జయంత్, మహిళలు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల నిరవధిక సమ్మె



సమ్మె చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

నేరడిగొండ: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పోస్టల్ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. బుధవారం మండల కేంద్రంలోని తపాలా శాఖ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని పోస్టల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.రాజు, జి.వెంకటేశ్, జి.కార్తీక్, శామిలి, సారిక, నారాయణ, అజీజ్, అనిల్, అంజయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్‌రూరల్: క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఉట్నూర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట గల ప్రాంగణంలో బుధవారం రాత్రి జరిగిన క్రీస్తు జయంతి మహోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం నాన్ ట్రైబల్స్‌కి అన్యాయం చేసిందని, అన్నివర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. చర్చిల్లో మౌలిక వసతులు కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎంపీపీ జైవత్‌రావు, పాస్టర్ ప్రవీణ్, డేనియల్, జోసెఫ్, శామ్యూల్, చంద్రయ్య, లాజర్, దేవానందం పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

గుడిహత్నూర్: మండలంలో వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 30 విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన ఉల్లాస్ ట్రస్టు ద్వారా ఒకొక్క విద్యార్థికి రూ. వెయ్యి స్కాలర్‌షిప్ చెక్కులను గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలో అందజేశారు. ట్రస్టు సభ్యుడు చంద్రకాంత్ సాంగో మాట్లాడుతూ.. చదువులో ప్రతిభ కనబరిచిన వారిని ప్రోత్సహించేందుకు ట్రస్టు ద్వారా ప్రతీఏటా వివిధ రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, సర్పంచ్ జాదవ్ సునీత, హెచ్‌ఎం దేవదాస్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివాజీ పాల్గొన్నారు.

పత్తి రైతు పరేషాన్

- అధిక వర్షాలకు తగ్గిన దిగుబడి
- గతేడాది 10 లక్షల 51 వేల క్వింటాళ్లు కొనుగోళ్లు
- ఈఏడాది ఇప్పటి వరకు వచ్చింది 2,41,000 వేల క్వింటాళ్లే



ఇచ్చోడ శివారులో రెండుసార్లు పత్తి ఏరడంతో పరిగె పోయిన పత్తి



ఈఫొటోలో ఉన్న రైతు పేరు సతీష్‌రెడ్డి. ఇచ్చోడ మండలంలోని అడేగామ (కె) గ్రామానికి చెందిన రైతు. ఈఏడాది 15 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు, ఎకరం పత్తి సాగుకు రూ 30 వేల వరకు ఖర్చు చేశాడు. ఎకరానికి సగటున 8 క్వింటాళ్ల దిగుబడి రావాలి. కానీ నాలుగు క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ఏటా మూడుసార్లు పత్తి ఏరేవారు. ఈఏడాది రెండుసార్లు ఏరడంతో చేను పరిగె అయిపోయాయి. 15 ఎకరాల సాగుకు రూ. 4 లక్షల యాభైవేల వరకు ఖర్చు చేశారు. తగ్గిన దిడుబడులతో రూ. లక్ష వరకు నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఇచ్చోడ: ఈఏడాది పత్తి రైతు పరేషాన్‌లో ఉన్నాడు. పత్తి సాగు చేసిన రైతు నష్టాల్లో కూరుకుపోయాడు. జిల్లాలో ప్రధాన పంట పత్తి. ఒడిదుడుకులతో ప్రారంభమై వానాకాలం సాగు రైతులకు నష్టమే మిగిల్చింది. కాత, పూత దశలో భారీగా కురిసిన వర్షాలు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడులు రావాల్సి ఉండగా.. సగానికి పడిపోయింది. ఒక్కసారి ఏరిన పత్తితోనే చేలన్ని ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొంప ముంచిన వర్షాలు..

ఈఏడాది పత్తి విత్తుకున్నప్పటి నుంచి పత్తి ఏపుగా పెరిగే వరకు రెండు నెలల పాటు వర్షాలు కురిశాయి. చేలల్లో కలుపు మొక్కలు పెరగడం, పత్తి ఎదుగుదల లేకపోవడంతో ఆశించిన స్థాయిలో కాత, పూత రాలేదు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వర్షాలకు కాతపూత రాలిపోయింది. అప్పటికే పగిలిన పత్తి పూర్తిగా తడిసిపోయింది. పత్తి ఏరే దశలో వర్షాలు కురవడంతో కూలీలు దొరకక పోవడంతో చేలల్లోనే పత్తి తడిసి ముద్దయింది. ఇలా అన్ని రకాలుగా పత్తి రైతులు నష్టపోయారు.

మార్కెట్‌కు వచ్చింది తక్కువే...

గతేడాది జిల్లాలో పత్తి మంచి దిగుబడి రావడంతో మార్కెట్‌కు 10,51,000 క్వింటాళ్ల పత్తిని రైతులు తీసుకొచ్చారు. ఈఏడాది డిసెంబర్ 13 నాటికి కేవలం 2,37,848 క్వింటాళ్లు మాత్రమే పత్తి కొనుగోళ్లు జరిగాయి. కొంత మంది పెద్ద రైతుల వద్ద ఉన్న నిల్వలు లక్ష క్వింటాళ్ల వరకు ఉంటుందని అంచనా. జనవరి నాటికి చేలల్లో మరో విడత ఏరితే మరో లక్ష క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన గరిష్ఠంగా 5 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయి. మరో 5.50 లక్షల క్వింటాళ్ల దిగుబడిని రైతులు కోల్పోవాల్సి వస్తుంది. దీంతో ఈ ఏడాది పత్తికి దిగుబడులు సగానికి సగం పడిపోయినట్లు తెలుస్తోంది.

ఈ–కేవైసీ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌మోహన్

తలమడుగు: రేషన్ లబ్ధిదారుల ఈ–కేవైసీని వేగవంతం చేయాలని తహసీల్దార్ రాజమోహన్ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడారు. ఈనెలాఖరులోగా వంద శాతం పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు సకాలంలో రేషన్ అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, రేషన్ డీలర్లు ముస రాకేశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.


ఇంద్రవెల్లి: మండలంలోని రేషన్ షాపు డీలర్లు ప్రతిఒక్కరికీ తప్పకుండా ఈ–కేవైసీ చేయాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. బియ్యం కోసం వచ్చిన వారికి ఈ–కేవైసీపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ–కేవైసీ చేయించాలని తహసీల్దార్ సుభాష్ చందర్ రేషన్ డీలర్లకు సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. రేషన్ డీలర్లు ఈ–కేవైసీ త్వరితగతిన పూర్తి చేసేందుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యాబోధన చేయాలి

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. గురువారం మండలంలోని బొందిడి, రేంగన్‌వాడీ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రీస్కూల్, గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యలక్ష్మి రికార్డులను పరిశీలించారు.

నీరున్నా.. నిరుపయోగం




నీటితో కళకళలాడుతున్న ముత్నూర్ చెరువు

- చెరువులకు నిర్మించని కాలువలు
- రబీకి అందని సాగునీరు
- పంటలు వేసుకోలేక పోతున్నామని రైతుల ఆవేదన

గుడిహత్నూర్: రైతన్నలకు రబీలో సాగునీరు అందించాలన్న ప్రభుత్వత లక్ష్యం నెరవేరడం లేదు. చెరువుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించినా.. అవి నిరుపయోగంగా మారుతున్నాయి. దీనికి కారణం చెరువులకు కాలువల నిర్మాణం చేపట్టక పోవడం. దీంతో చెరువు నిండా నీరున్నా.. రైతులకు ఎలాంటి ఫలితం ఉండడం లేదు. ఆయకట్టుకు కనీసం నీరందని దుస్థితి నెలకొంది. మండలంలో తోషం, సీతాగోంది, శంభుగూడ, ముత్నూర్ గ్రామ శివారులో చెరువులు ఉన్నాయి. ఈ నాలుగు చెరువులకు కాలువల లేక ఆయకట్టుకు సాగు అందడం లేదు. వీటిలో ముత్నూర్ ఎగువ భాగంలో ధామన్ గూడకు ఆనుకొని నాబార్డు నిధులు రూ.2.90 కోట్లు వెచ్చించి 2005లో చెరువు నిర్మాణం చేశారు. దీని ఆయకట్టు కింద ముత్నూర్, మచ్చాపూర్, గ్రామ పంచాయతీలలోని 780 ఎకరాలు సాగు నీరు అందివాల్సి ఉన్నా.. కాలువల నిర్మించకపోవడంతో పంటలకు చుక్క నీరు అందడం లేదు. నామమాత్రంగా చెరువుకు ఇరు పక్కల రెండు కాలువనలు 50 మీటర్ల పొడవున సిమెంటుతో కట్టి 1.5 కి.మీ. ప్రొక్లెయినర్‌తో మట్టి కాలువ తవ్వి గాలికి వదిలేశారు. ప్రస్తుతం ఇవి పూర్తిగా పూడుకు పోయాయి. తెలంగాణ ప్రభుత్వంలో చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడంతో గత మూడు సంవత్సరాల క్రితం చెరువు ఎత్తు పెంచడానికి రూ. 2.50 కోట్లతో పనులు చేపట్టారు. కానీ పూర్తిస్థాయిలో కాలువులు నిర్మించలేదు. ఏటా ఖరీఫ్‌లో పంట నష్టపోతున్న తాము రబీలోనైనా నష్టాలను పూడ్చుకోవాలనుకుంటే కాలువలు లేక సాగు నీటి లబ్ధి పొందలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెరువులకు కాలువల నిర్మాణం చేపట్టి ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించాలని కోరుతున్నారు.


ఎలాంటి లాభం లేదు



మా ఊరికి చెరువు నిర్మించినా మాకు నయా పైసా లాభం లేదు. నీళ్లు ఉన్నా కాలువలు లేక రబీ పంటలు వేసుకోలేక పోతున్నాం. కాలువలు ఉంటనే కదా.. సాగు నీరు అందించి రెండు మూడు పంటలు వేసుకోగలం. పక్కనే నీళ్లు ఉన్నా ఫలితం దక్కడం లేదు.

– ములజ్‌కర్ సుశీల్, రైతు, ముత్నూర్

కాలువలు నిర్మించాలి



ఖరీఫ్‌లో ప్రతి ఏటా వరదల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. పక్కనే చెరువుండి లాభం లేకుండా పోతోంది. కాలువలు నిర్మిస్తే ఎంతో మంది రైతులు లబ్ధిపొందుతారు. కూరగాయలు పండించి ఉపాధి పొందుతారు.

– దినకర్ నాగర్‌గోజే, గ్రామపటేల్, ముత్నూర్

సంక్షిప్త వార్తలు

కేటీఆర్‌ను కలిసిన ఎంపీపీ

బోథ్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ గురువారం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మంత్రి సీతక్కను అభినందించిన జాంటి

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జాంటి గురువారం హైదరాబాద్‌లో మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆమెను కలిసి అభినందించారు.

చెన్నూర్ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని ఆదిలాబాద్ జిల్లా మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. నాయకులు అల్లూరి భూమన్న, అర్క దేవిదాస్, ప్రభుదాస్, కంటె నర్సయ్య, సుభాష్, ఆర్క రమేశ్, సత్యనారాయణ, సాయిబాబా, ప్రశాంత్, క్రాంతి కుమార్, అరుణ్, రవి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో పలువురు బీజేపీ నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. నాయకులు జోగు రవి, కౌన్సిలర్లు కృష్ణ యాదవ్, ఆకుల ప్రవీణ్, దొడ్డన్న, వేదవ్యాస్, శివ, సాయి ఉన్నారు.

ఆర్థికసాయం

బోథ్: సొనాల గ్రామానికి చెందిన పెర్క రమేశ్ ఇటీవల మృతి చెందారు. కాగా మృతుడి కుటుంబానికి అతడి స్నేహితులు గురువారం రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మెస్రం భూమన్న, మిట్కరి పరమేశ్, కేవల్ సింగ్, విఠల్, దేవి సింగ్, బద్దం శ్రీనివాస్, కసిరే పోతన్న పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు ప్రారంభం

నార్నూర్: ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకును గురువారం సర్పంచ్ రాథోడ్ సావీందర్ ప్రారంభించారు. మాన్కాపూర్ పరిధిలోని రాజులగూడ గ్రామంలో మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పీఎంఏఏజేవై నిధులతో నూతనంగా వాటర్ ట్యాంకు నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు రాథోడ్ గోవింద రావు, రాథోడ్ జైవంతరావు, చౌహాన్ కై లాస్ పాల్గొన్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: జాతీయ స్థాయి విలువిద్య (ఆర్చరీ) పోటీలకు ఎంపికైనా మండలంలోని చించుఘాట్ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల 9వ తరగతి చదువుతున్న పీవీటీజీ (కొలాం) బాలిక టేకం లక్ష్మిని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి గురువారం సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రవీందర్, సంజీవ్, గోవింద్ రావ్, అర్జున్ పాల్గొన్నారు.

రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు రక్తదానం చేశారు. అత్యవసర సమయంలో రక్తం దొరకక చాలా మంది ఇబ్బంది పడుతున్నారని, సామాజిక బాధ్యతగా రక్తదానం చేసి వారిని ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎదులాపురం: చలో ఢిల్లీ ధర్నాను విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేపడతామని గతంలో హామీ ఇచ్చిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చి పదేళ్ల గడుస్తున్నా.. వర్గీకరణ ఊసే లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోడీ స్పందించి కమిటీ నివేదికను తెప్పించుకొని పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో హాజరై ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నక్క రాందాస్, జిల్లా కోశాధికారి లింగంపల్లి ప్రసన్నకుమార్, దివాకర్ నరసింహులు, తారా రవికుమార్, కత్తి గంగాధర్, ముక్కెర అశోక్, కొల్లూరి స్వామి, బట్టు మహేందర్, చొప్పదండి భూమన్న, నలిగంటి మహేశ్ పాల్గొన్నారు.

వివేకజ్యోతి పోటీ పరీక్షలు ప్రారంభం



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: స్వామి వివేకానంద రామకృష్ణ మఠంను స్థాపించి 125 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శ్రీరామకృష్ణ సేవా సమితి ఆదిలాబాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో 7 నుంచి 10వ తనగతి చదువుతున్న విద్యార్థులకు వివేకానంద నీభారత జాతికి నాహితవు అనే పుస్తకంపై గురువారం మావల మండలంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలికల పాఠశాలలో పోటీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంజేపీ డీసీవో, పాఠశాల ప్రిన్సిపాల్, సేవా సమితి సభ్యులు పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ విద్య మాట్లాడుతూ.. వివేక జ్యోతి పోటీ పరీక్షలను తమ పాఠశాల నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి పోటీ పరీక్షల ద్వారా విద్యార్థులలో ఆత్మ విశ్వాసం, ఏకాగ్రత, శ్రద్ధ, త్యాగం, సేవ భావాలతో పాటు దేశభక్తి పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఆరే భూమన్న, ప్రధాన కార్యదర్శి కోరెడ్డి లెనిన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'కుటుంబ నియంత్రణలో భాగస్వాములు కావాలి'



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఇచ్చోడ: కుటుంబ నియంత్రణలో మహిళలతో పాటు పురుషుల భాగస్వాములు కావాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వెసెక్టమీ శస్త్ర చికిత్సలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. పురుషులు వెసెక్టమీ శస్త్ర చికిత్సల ద్వారా కుటుంబ నియంత్రణ చేసుకోవచ్చన్నారు. ఈ ఆపరేషన్ చాలా సులువైందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ రాజుబాయి, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: వెసెక్టమీ శాస్త్ర చికిత్సపై అందరికీ అవగాహన ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. గురువారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ నియంత్రణలో పురుషుల భాగస్వామ్యం ఉండాలన్నారు. పురుషులకు ఎలాంటి కుట్టులేకుండా వెసెక్టమీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి: కుటుంబ నియంత్రణలో భాగంగా వెసెక్టమీ ఆపరేషన్లపై అవగాహన కల్పించాలని భీంపూర్ ఆరోగ్య కేంద్రం హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్ సిబ్బంది సూచించారు. గురువారం మండలంలోని ధనోర, గోన గ్రామాల్లో వైద్య సిబ్బందితో కలిసి వెసెక్టమీ ఆపరేషన్‌పై అవగాహన కల్పించారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి రూ.1100 పారితోషకం ఇవ్వడం జరుగుతుందన్నారు. వారి వెంట సూపర్ వైజర్ గంగాధర్, ఆశ కార్యకర్తలు కమల, స్వప్న, పద్మ పాల్గొన్నారు.

అయ్యప్ప మెట్లపూజ



మెట్లపై పడిని వెలిగిస్తున్న అయ్యప్పస్వాములు

తాంసి: మండలంలోని జామిడి గ్రామంలో గురువారం అయ్యప్పస్వామి మెట్ల పూజను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కుంట సరితా కేశవ్‌రెడ్డి, గురుస్వామి సతీష్ ఆధ్వర్యంలో అయ్యప్పకు పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం పద్దెనిమిది మెట్లపై సర్పంచ్ దంపతులు పడిని వెలిగించారు. ఉదయం అయ్యప్పస్వామి పల్లకిని ఊరేగించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో గురువారం జాదవ్‌కిరణ్ స్వామి ఇంటిలో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

రసాభాసగా ఉపాధిహామీ గ్రామసభ



గోట్కూరిలో గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న కూలీలు, గ్రామస్తులు

- పనులు చేసినా.. డబ్బులు రాలేదని ప్రశ్నించిన కూలీలు

తాంసి: మండలంలోని గోట్కూరి గ్రామంలో గురువారం ఉపాధిహామీ సామాజిక తనిఖీలలో భాగంగా నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. సర్పంచ్ జయశ్రీ అధ్యక్షతన నిర్వహించిన తనిఖీ బృందం సభ్యులు పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. 2022– 23 సంవత్సరానికి గాను ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల వివరాలను ఆడిట్ బృందం సభ్యులు చదివి వినిపించారు. ఈక్రమంలో ఉపాధికూలీలు, గ్రామస్తులు జోక్యం చేసుకొని పనులు చేసినా.. బిల్లులు రాలేదని ఆరోపించారు. గ్రామంలో నర్సరీ, మట్టికట్టలు, గ్రౌండ్ నిర్మాణానికి సంబంధించిన రూ.3 లక్షలతో చేపట్టిన ఉపాధిపనుల్లో అవకతవకలు జరిగాయన్నారు. కూలీ పనులు చేసిన వారికి కాకుండా ఇతరులకు ఎలా డబ్బులు చెల్లింపులు చేశారని ప్రశ్నించారు. డబ్బులను రికవరీ చేయాలని అప్పటి వరకు గ్రామసభ జరగనివ్వమని తెల్చిచెప్పారు. తాంసి ఎస్సై శివరాం సిబ్బందితో వచ్చి గ్రామస్తులతో మాట్లాడి శాంతింపజేశారు. అనంతరం డీఆర్పీ రాజేశ్వర్ నివేదికను చదివి వినిపించి, గ్రామస్తులు, కూలీలతో మాట్లాడి పనుల్లో జరిగిన అక్రమాలపై వివరాలు నమోదు చేశారు. దుర్వినియోగమైన నిధులను రికవరీ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్పీ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, టెక్నికల్ అసిస్టెంట్ పుష్ప, ఆడిట్ బృందం సభ్యులు, గ్రామస్తులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.